# పంతులమ్మ

★

కె. వి. అప్పలాచార్య

లక్ష్మణరావుగారికి ప్రాణం మీదకు వచ్చిందనే వార్త తెలియగానే లలిత హృదయంలో తుఫాను చెలరేగింది. ముచ్చటగా ఏరికోరి చేసినటువంటి సంబంధం ఇంతట్లో ఇలా భగ్నమై పోతుందాయనే విచార సముద్రంలో మునిగి పోయారు లలిత తలిదండ్రులు. లలితను వెంటతీసుకొని రాజమండ్రీనుంచి బయలుదేరి వెళ్లారు అల్లుణ్ణి చూడటానికై!

అమాయకపు లలిత హృదయంలో తలంచరాని ఎన్నో ఊహాలు పరుగులుతీస్తున్నాయ్. లక్ష్మణరావుగారు తనభర్తని మాత్రం ఆమెకు తెలుసు. తానుఎందుకు పెళ్లిచేసుకొన్నదీ, ఎవరికోరకుకళ్యాణ తిలకం ధరించినది అనేవిషయం ఆమెకు తెలియదు. పెళ్లిఅయిన సమయంలో ఆమె ఫోర్తు ఫారంచదువుతున్నప్పటికి పెళ్లివిషయం ఆమె చర్చించుకోలేదు. యధాలాభంగా తలిదండ్రులు B. A. ప్యాసయిన లక్ష్మణరావుగార్ని చూపించి ఆయననీకు నచ్చాడా తల్లీ? అని అడిగేసరికి ఆయన బి. ఎ. ప్యాసయ్యారన్న ఊహాతోను, తనకంటె ఎక్కువ జ్ఞానం కలదన్న తలంపుతోను, ఆయనలో ఆకర్షణీయమైన అందానికి, లలిత, సరేనంది. పెళ్లికూడా అయిపోయింది. అంటే లలిత చదువుకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చిందన్నమాట. విజ్ఞాన దాహంకల భార్యని ఓపికయున్నంత వరకు చదివించండి" అనే లక్ష్మణరావుగారి మాటల ఆధారంతో లలిత పట్టాపట్టి, చదువుకుంటోంది. ఆమెతోచదువులో ఎవరూ నిలబడలేరనే విషయం నిరూపించాలని ప్రయత్నించింది గాని, పోటీగా సుధాకర్ నిలబడ్డాడు. అతన్ని జయించలేకపోయింది లలిత, తనకంటె బాగాచదివే సుధాకర్‌ను ఎంత గౌరవిస్తుందో మనం ఊహించలేము. వారిద్దరూ అప్యాయంగా మాట్లాడుకొంటోంటే ఎటువంటి ముత్యాలు రాలుతున్నాయో మనం చూడలేము—

లక్ష్మణరావుగారు గుండెజబ్బుతో చనిపోయారు. చనిపోతూ లలితను దగ్గరకు పిలిచి ఇలాచెప్పారు.

"విజ్ఞాన సంపాదనలో నీకున్న Interest ను నేను చంపేయలేను. నీ దాహం ఎంతవరకూయుందో అంత వరకూ చదువు. నీకు చదువు కంటె వేరేగతిలేదు. చదువుకో! ఒకళ్లకున్న విజ్ఞానాన్ని ధారపోసి వాళ్లని బాగుచేయ్ లలితా! జీవితంలో ఎన్నోకష్టాలుంటాయ్. వాట్లని ధైర్యంతో ఎదుర్కొ నడమేనీ...పం...తు...ల లి...తా!"—

లలిత హృదయంలో ఆయన మాటలు బాగా నాటుకొన్నాయి. భర్త దిగవంతుడయ్యాడనేవిచారం ఆమెలో బాగా కలుగలేదు. తనుగురించి తలిదండ్రులు బాధ పడుతున్నారన్న విచారమే ఆమెలోని శక్తిని నశింపచేస్తోంది. తమ కూతురుకు కలిగిన వైధవ్యానికి ఆ ముసలి దంపతుల విచారానికి అంతులేదు. వాళ్లకి అల్లుడు పోవడం ఒక విచారము. మరోక ప్రక్క ప్రపంచం కూసే పాడుకూతలకు తలఒగ్గి జీవచ్ఛవాలవలె జీవించడం మరోకవిచారం.

"లలితా! నీ కండ్లులో ఏదో కొరత కనబడుతోందేం? నీ ముఖము కళావిహీన మయినట్లుంది. ఉత్సాహంగా ఉన్నట్లు కనబడటంలేదు. ఒంట్లో బాగాలేదా?"—అమాయకంగా సుధాకర్ అడిగాడు ఓనాడు—

"భర్తఅనే వ్యక్తి కట్టిన మంగళసూత్రం తెగిపోయింది"—కళ్లలో నీళ్లు తిరిగాయ్.

ఇద్దరూ మరింక మాట్లాడలేకపోయారు—ఒకరి మొఖం మరోకరు చూడలేక పోయారు ఆ సమయంలో. కాలచక్రం మూడునెలలు తిరిగింది—

* * * *

"ఏరాఅబ్బాయ్! ఎన్ని ఉత్తరాలు వస్తున్నాయో చూశావా?"—అని సుధాకర్ తండ్రి.

"ఒరేయ్ పెద్దోడా! నీ తర్వాత ఇద్దరు బడుద్ధాయిల్లాగ పెరుగుతూ యున్నారు. నాకా రోజు రోజుకీ ఓపిక తగ్గుతోంది. చుట్టుప్రక్కల వారంతా మీ పెద్దకోడల్ని ఎప్పుడురప్పించుకొంటారమ్మా అని అడిగేవారే! సుధీ! ఆ కాస్తపెళ్లి నీకు అయిందంటే కొంతకాలంవరకు హాయిగా ఉంటుంది నాప్రాణం!"—అంది సుధీ తల్లి.

"అయితే మీరిద్దరూ ఏమిటంటారు?"—అన్నాడు తీక్షణంగా సుధాకర్.

"అనేదేమిటో! రేపోమాపో సంబంధం చూడటానికి అమలాపురం వెళ్తాం. నీకు వచ్చిందోలేదో చూసి చెపితే నాన్నగారు వెళ్లి సెటిల్ చేస్తారు!"—అందితల్లి.

"పెళ్లి! ఎవరికమ్మా పెళ్లి? నాకేనా? నాకేమంత అనుభవం యుందని పెళ్లిచేస్తున్నారు?"—

"నీ ముఖం పెళ్లంటే అందరూ ఎంతో సంతోషపడుతారు. నువ్విలా ఎడ్డెంతెడ్డెం అంటే ఎలాగురా? హాయిగా సోమయాజులుగారు నాల్గువేల రూపాయల రొక్కంతో పిల్లని ఇస్తామంటే తిరస్కరించడమా? ఆలోచించు సుధీ! నీకంటె మాకే ఎక్కువ బాధ్యతయుంది నీ పెళ్లివిషయంలో!"—

"ఉంటే ఉండొచ్చు. పెళ్లిచేసుకొనేవాడ్ని నేనుగాని మీరు కాదుగదా!"—

"అయితే మేము నీ బాగోగులుకోరి చేయటంలేదంటావా?"...అందితల్లి తీక్షణంగా.

"అలా కనబడటంలేదు." "వివాహం విద్యనాశనం అన్నమాటలు మీరు మర్చిపోయారా? మీవంటిపెద్దలే ఆ వేదవాక్యాలు చెప్పింది—ఇంకో సంగతి సోమయాజులుగారు - నాల్గువేల రూపాయలతో పిల్లని ఇస్తున్నారన్న సంతోషమేగాని మీకు, ఆయనెలా ఇస్తున్నాడో, ఎక్కడ్నుంచి అప్పుతెచ్చి ఇస్తున్నాడో ఆనేవిషయం ఆలోచిస్తున్నారా?"—

"ఒరేయ్ ఏమిటీ నీ వాగుడు? ఎందుకా వెధవ లెక్చరంతా? ఇంతకీ నువ్వు అనేది ఏమిటో?"—అన్నాడు తండ్రి కోపంతో—

"నేననేది ఏమీలేదు. ప్రస్తుతం పెళ్లి అక్కర్లేదనే అంటాను."—అన్నాడు సుధాకర్ నిర్మలంగా.

"పెళ్లిచేసుకోకుండా ఏం చేస్తావ్? ఏకిరస్తాని దాన్నో పెళ్లి చేసుకొంటావా?"—

"నేనామాట అనటంలేదు. నేను స్వతంత్రుడ్ని అయ్యాక చేసుకొంటాను."—

"ఒరేయ్ పెద్దోడా! తెలివి తక్కువగా మాట్లాడుతున్నావ్! ఏ సమయానికేది జరగాలో అది జరగకపోతే అసహ్యంగా యుంటుంది. నామాటవిను!"—అంది తల్లిదీనంగా.

"మీరెన్ని అయినా చెప్పండి. ఇప్పుడు నేను చేసుకోను!"—అంటూ పుస్తకాలు తీసుకొని బయలుదేరాడు స్కూలుకి సుధాకర్.

"ఒరేయ్! ఎక్కడికా తొందర? తొమ్మిది అయిందో లేదో స్కూలుకు తొందరేం?"—

"నా క్లాసుమేటు ఎదురుచూస్తోయుంటుంది. చదువుకోవాలి ఆమెతో...!"—

"ఆడదానితో చదువేమిటో నీకు?"—

"పాఠాలు బాగా రావడానికి. నాకు ఫస్టు మార్కులు రావడానికి ఆ అమ్మాయే కారణం!"—

"నీ మార్కులతో, నీ చదువుతో మాకు పని లేదు. ఆడదాని సహవాసం మంచిదిగాదు. నీలో చెడిపోయే సూచనలు కనబడుతున్నాయ్!"—అన్నాడు తండ్రి.

"ఏమయినాసరే. నాకు చదువే ప్రధానం!"—అంటూ చరచరా వెళ్లిపోయాడు సుధాకర్—

తలిదండ్రులిద్దరూ ఒకరి మొఖం ఒకరుచూసుకొన్నారు—

• • •

"అబ్బ! ఈ పాడు ప్రపంచంలో బ్రతకటంకంటె చావడమే మేలు. భర్తపోయినంతమాత్రంచేతనే హక్కులన్నీ లాక్కొంటారా? తలకునూనె గూడా రాచుకోగూడదట. తలలో పూలుఅసలే పనికిరావట. ముచ్చటగా పెంచుకొన్న ముంగురులు మూలంతో తెగిపోవలసిందేనా? సంఘం...!. పాడుసంఘం. ఇలా చేయడానికిసంఘానికేం హక్కుంది? ఇంతకంటె ప్రాణాలుతీస్తే బాగుంటుంది? ముచ్చటగా పెంచుకున్న ముంగురులు ముడివేసుకొంటేలోకం సహించదూ? ఎందుకంత అన్యాయ? భగవత్ప్రసాదితమైన నల్లని మేలిముసుగును తీసి, మాటి మాటికి జారిపోయే తెల్లముసుగు వేసుకోవాలి? వంటింటి కుందేలులా పొయ్యి దగ్గర మగ్గిమాడవలసిందేనా? నాల్గుగోడలు మధ్యానలిగి పోవలసిందేనా? వితంతువులు రాల్చే కన్నీటిబొట్టు ఒక్కొక్కటి సంఘాన్ని ఎప్పటికయినా దహింపచేయదూ? ముక్కుర హృదయాల్ని మట్టుపెట్టే మహమ్మారిగా పరిణమించదూ? వితంతువయినంత మాత్రాన ఆశలు, ఆనందం నశిస్తుందా? ఉపవాసాలు. దిబ్బరొట్టెలు తిన్నంతమాత్రాన ఆశలు అడుగంటి పోతాయా? తలతీయించినంత మాత్రాన సంఘానికి తృప్తితీరుతుందా? ఆరిభగవంతుడా! ఎన్నికష్టాలు? వాట్లనుగురించి తర్కించికొని విచారించింది——ఒక్క లలిత విచారించినంత మాత్రాన లాభం ఉందా? స్త్రీలోకమంతా ఆలోచించిననాడుముక్తికలుగుతుంది—భర్తసందేశప్రకారం పంతులమ్మ అయింది లలిత. తనవిజ్ఞానాన్ని అందరికి పంచిపెడుతోంది. సుధాకర్ ఇంతవరకు పెళ్లిచేసుకోలేదు. కట్నాలు కానుకలు నశించేదాకా వివాహం చేసుకోనని శపథం చేసాడు సుధాకర్—వితంతు వివాహాలు జరిగి, స్త్రీలోకం బాగుపడేదాకా పునర్వివాహం చేసుకోనని లలిత ప్రమాణం చేసింది—భాగతమాత నుద్ధరిస్తూ ఇద్దరూ దేశసేవ, స్త్రీ సేవచేస్తున్నారు—

ఇప్పటికి ఇద్దరూ కల్సుకొంటూనే యున్నారు ఎన్నో విషయాలు గంటల తరబడి చర్చించుకొంటూనే యున్నారు. లలిత ఇప్పటికి పంతులమ్మ పనే చేస్తోంది. బ్రహ్మచర్యం అవలంబించి సుధాకర్ బి. ఎ. యల్. టి. ప్యాసై ఉద్యోగం చేస్తున్నాడు కాని ఇద్దరిలోనూ చలనం కలుగలేదు. కామోద్రేకం కలుగలేదు. ఏనాడు దేశం బాగుపడుతుందోగదా? ఏనాడు వారిద్దరూ ఆదర్శ దంపతులవుతారో గదా? కాని! ప్రపంచం వారిద్దర్నీ భార్యాభర్తలనే అంటోంది. ఇటువంటి పవిత్ర హృదయాలు దేశానికి బలి అవుతేనేగాని దేశం బాగుపడదేమో?


మంచి రకమే
రాణిస్తుంది




అంచేతనే
జాబ్కో బ్రిలియన్టైన్
ప్రఖ్యాతిగాంచింది.